

కొమురవెల్లి, కొండపోచమ్మ ఆలయాల్లో హరియాణా గవర్నర్ పూజలు

జగదేవ్‌పూర్/చేర్యాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామిని, జగదేవ్‌పూర్ మండలం తిగుల్‌నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ అమ్మవారిని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావుతో కలిసి హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, వారి కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. గవర్నర్ దత్తాత్రేయకు, ఎంపీ రఘునందన్‌రావుకు నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.

నోటీసులకు స్పందిచకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

- మెదక్ మున్సిపాలిటీలో ఆస్తిపన్ను బకాయిలు
- ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.10.50 కోట్లు పెండింగ్
- నిధుల లేమితో నిర్వహణ అస్తవ్యస్తం
- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి



మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

ఫేస్ టు ఫేస్

మెదక్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా పేరుకుపోతున్న ప్రభుత్వ కార్యాలయాల ఆస్తిపన్ను బకాయిల కోసం పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందించడం లేదని, దీంతో మున్సిపల్ కార్యాలయ నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పన్ను బకాయిలతో సిబ్బందికి వేతనాలు చెల్లించలేని దుస్థితి నెలకొందన్నారు. రూ. కోటికి పైగా విద్యుత్ బకాయిలు చెల్లించలేక పోతున్నామని వాపోయారు. పన్ను బకాయిలు చెల్లించాలని మరోసారి నోటీసులు ఇస్తామని, స్పందించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

నిధుల కొరతతో మెదక్ మున్సిపాలిటీ ఎదుర్కొంటున్న సమస్యలేమిటి?

స్థానిక సంస్థల మనుగడకు పన్నులే ఆధారం. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయ భవనాల పన్నులు కోట్లాదిగా పేరుకుపోయాయి. 109 ఆఫీసుల నుంచి రూ.10.50 కోట్ల ప్రాపర్టీటాక్స్ రావాల్సి ఉంది. టెలికాం, పోస్టల్, తహసీల్దార్, నీటి సరఫరా, పీడబ్ల్యూడీ, ఎంపీపీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, సాంఘిక సంక్షేమశాఖ... తదితర సర్కారు భవనాల ఆస్తిపన్ను పెండింగ్‌లో ఉంది. డిమాండ్ నోటీసులు జారీ చేసినా స్పందించడం లేదు. ఫైనల్ నోటీసు ఇచ్చిన తర్వాత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. రెండు సంవత్సరాల నుంచి మున్సిపాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు నిలిచిపోయాయి.

పన్ను వసూలుకు లక్ష్యం చేరుకోవడానికి ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రవేటు ఆస్తులకు సంబంధించి రూ.5 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నాం. సిబ్బంది కొరత, పనిభారంతో పన్ను వసూలు ఆలస్యమైంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నియామకాల్లో 27 మంది వార్డు అధికారులు విధుల్లో చేరారు. ప్రస్తుతం వారందరూ పన్ను వసూళ్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటివరకు 61.32 శాతం ఆస్తి పన్ను వసూలు చేయగలిగాం.



మెదక్ పార్లమెంటు నియోజకవర్గ నేతలతో సమావేశమైన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

పార్టీ లైన్ దాటొద్దు

- కాంగ్రెస్‌లో విభేదాలకు తావు లేదు
- రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి
- మెదక్ పార్లమెంటు నియోజకవర్గ ముఖ్య నేతలతో సమీక్ష
- అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా అభిప్రాయ సేకరణ
- త్వరలోనే సీనియర్లతో సమన్వయ కమిటీ.. పరిశీలకుల నియామకం
- ఈ నెలలోనే నియోజకవర్గాల్లో పాదయాత్రలు
- ఎమ్మెల్యే గూడెం వైఖరిపై మండిపడిన కాటా శ్రీనివాస్‌గౌడ్
- రెండు గంటలు ఉత్కంఠగా సాగిన సమావేశం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 4: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన మీనాక్షి నటరాజన్ మెతుకుసీమలో పార్టీని చక్కదిద్దడంపై దృష్టిపెట్టారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో మెదక్ నేతలకే ముందుగా పిలుపు వచ్చింది. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం ఆమె చర్చించారు. సమీక్షకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మూడు జిల్లాల పార్టీ అధ్యక్షులు, ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రూపులు, విభేదాలపై మీనాక్షి నటరాజన్ సున్నితంగా హెచ్చరించారు. పార్టీలైన్ దాటితే చర్యలు తప్పవని సంకేతాలిచ్చారు.

మెదక్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా ఆరు చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే గెలిచారు. మెదక్ అసెంబ్లీ స్థానంలో మాత్రం కాంగ్రెస్ నుంచి మైనంపల్లి రోహిత్ గెలుపొందారు. పార్టీ బలహీనంగా ఉన్న పార్లమెంటు స్థానం కావడంతో మీనాక్షి నటరాజన్ ముందుగా ఈ స్థానాన్నే ఎంచుకున్నారు. ఇక్కడ కాంగ్రెస్ వెనుకబడడానికి గల కారణాలపై నేతలతో చర్చించారు. దాదాపు 2 గంటలు అనేక విషయాలపై చర్చించారు.

సెగ్మెంట్లలో సమస్యలపై ఆరా..

అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా పార్టీ పరిస్థితి గురించి మీనాక్షి ఆరా తీశారు. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల డీసీసీ అధ్యక్షుల అభిప్రాయాలను విన్నారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌తో పాటు ఆరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఇతర నియోజకవర్గస్థాయి నేతలకు కూడా మాట్లాడే అవకాశం కల్పించారు. నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ బలాలు, బలహీనతల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్ష కేవలం అవగాహన కోసమేనని త్వరలోనే మరోసారి సమావేశమై క్షుణ్ణంగా చర్చించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

పటాన్‌చెరు పంచాయితీ

పార్టీ నూతన ఇన్‌చార్జి మీనాక్షి ఎదుట పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ పలు విషయాలను ఉంచారు. తన అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండానే బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పార్టీలో చేరారని చెప్పారు. గడిచిన పదేళ్లలో కాంగ్రెస్ పార్టీ నేతలను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులకే మళ్లీ నియోజకవర్గంలో పోస్టింగులు ఇప్పించుకున్నారని వాపోయారు. పటాన్‌చెరులో కాంగ్రెస్ శ్రేణులంతా అసంతృప్తితో ఉన్నారని వివరించారు. ఇటీవల టీపీసీసీ కమిటీ సభ్యులు విచారణ చేసినా చర్యలు తీసుకోలేదని తెలిపారు.

పార్టీ బలోపేతానికి రూట్‌మ్యాప్

మెతుకుసీమలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు మీనాక్షి పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ముఖ్య నేతలతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. వీరి ద్వారా నియోజకవర్గాలవారీగా ఉన్న సమస్యలు, గ్రూపు తగాదాలను పరిష్కరించనున్నారు. అదేవిధంగా టీపీసీసీ నుంచి ప్రతీ నియోజకవర్గానికి ఇద్దరు పరిశీలకులను నియమించనున్నట్లు తెలిసింది. స్థానిక ఎన్నికల అభ్యర్థుల ఎంపికతోపాటు నామినేటెడ్ పోస్టుల భర్తీపై వీరు దృష్టి పెడతారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాల గురించి నియోజకవర్గాలవారీగా పాదయాత్రలు చేపట్టేందుకు స్థానిక నేతలు సిద్ధంగా ఉండాలని ఆమె సూచించినట్లు సమాచారం.

రంజాన్ వేళలు

బుధవారం ఇఫ్తార్: సాయంత్రం 6.30
గురువారం సహర్: ఉదయం 5.09

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

సంతలో కూరగాయలు విక్రయించి వస్తుండగా.. బైక్‌ను ఢీ కొట్టిన కారు 7



గొలుసు దొంగల అరెస్ట్

12.1 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం 7

ఏడుగురు నిందితుల రిమాండ్

ఏడుపాయలనే వారి టార్గెట్



గొట్టిముక్కుల శివారులో చిరుత సంచారం

దాడిలో లేగదూడ మృతి 7



మిర్చిలో మల్చింగ్

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు 7



బీజేపీ శ్రేణుల సంబరాలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, తపస్ బలపర్చిన మల్కా కొమురయ్య ఘన విజయం సాధించడంతో మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. మెదక్‌లో తపస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీకి తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, చల్లా లక్ష్మణ్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడె శ్రీనివాస్

మెదక్ అర్బన్, (ఆంధ్రజ్యోతి)



40 రోజులుగా ట్యాంకర్లే దిక్కు

సంగారెడ్డి జిల్లా కేంద్రం పక్కనే కంది మండల పరిధిలోని కొయ్యగుండు తండాలో ఎండలు ముదరక ముందే నీటి ఎద్దడి తీవ్రమైంది. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటడం, మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో 40 రోజులుగా పంచాయతీ ట్యాంకర్ ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నారు. రోజూ 10 ట్యాంకర్ల నీటిని ఇంటింటికి తిరిగి సరఫరా చేస్తున్నారు.

-కంది, (ఆంధ్రజ్యోతి)



సంగారెడ్డిలోని ఓ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

విజయీభవ...

నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సంగారెడ్డి, మెదక్ జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనుండగా.. 9.05 గంటల వరకు విద్యార్థులను అనుమతిస్తారని అధికారులు తెలిపారు. కానీ, ప్రశాంతంగా పరీక్ష రాయడం కోసం గంట ముందుగానే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. హాల్‌టికెట్‌పై కళాశాల ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా, నేరుగా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని రావచ్చు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగనుండగా, వాటిని హైదరాబాద్ కమాండ్ కంట్రోల్‌రూం నుంచి పరిశీలించనున్నారు.

-సంగారెడ్డి అర్బన్/కొల్చారం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి)



మెదక్ జిల్లా కొల్చారంలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

సత్వర పరిష్కారం.. సమన్యాయం

- రాజీమార్గంలో కేసుల పరిష్కారం
- లోక్‌అదాలత్‌లో ఇరువర్గాల గెలుపు
- ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే భారం తప్పే మార్గం
- 8న జాతీయ లోక్‌అదాలత్
- సంగారెడ్డి జిల్లాలో 6వేల కేసుల పరిష్కారమే లక్ష్యం

పదేళ్ల సమస్యకు తక్షణ పరిష్కారం

పదేళ్లగా పరిష్కారం దొరకని సమస్యకు లోక్ అదాలత్ ద్వారా సత్వరమే న్యాయం దక్కింది. హత్నూర మండలం పల్పనూర్‌కు చెందిన బేగరి దేవదాస్ 2014 మార్చి30న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా హత్నూర మండలం మల్కాపూర్ వద్ద మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ప్రమాదంలో దేవదాస్ మృతిచెందగా హత్నూర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. ఈ కేసు గతేడాది డిసెంబరు 14న లోక్‌అదాలత్ ముందుకు తీసుకురాగా పదేళ్ల తర్వాత ఇరువర్గాల మధ్య రాజీ కుదిరింది. మృతుడి కుటుంబానికి రూ.18 లక్షల పరిహారం చెల్లించాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు.

గాయపడిన బాలికకు న్యాయం

అమీన్‌పూర్ మండలం బీరంగూడకు చెందిన రమేష్ కూతురు శశిరేఖ 2022లో ఇంటి ఎదుట ఆడుకుంటుండగా ఓ కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి ఆమెను ఢీకొట్టాడు. ప్రమాదంలో శశిరేఖకు తీవ్రగాయం కావడంతో వైద్యులు ఆమె కాలును తొలగించారు. పోలీసులు కేసు నమోదు చేయగా ఇరువర్గాల సమ్మతి మేరకు గత లోక్‌అదాలత్‌లో రాజీ కుదిరింది. బాధితురాలికి రూ.14.75 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని న్యాయాధికారి ఆదేశించారు.

విభేదాలు మరిచి ఒక్కటైన జంటలు

సదాశివపేటకు చెందిన కుమ్మరి సూర్యకాంత్-కుమ్మరి అనిత, పటాన్‌చెరుకు చెందిన నరితా-రాజిరెడ్డి, అనూష-నాగరాజులు కుటుంబ తగాదాలు, మనస్పర్థల కారణంగా రెండు సంవత్సరాలుగా దూరంగా ఉంటున్నారు. విడాకుల కోసం కోర్టు మెట్లెక్కారు. గత సంవత్సరం జూన్ 8న నిర్వహించిన లోక్‌అదాలత్‌లో న్యాయాధికారుల కౌన్సిలింగ్‌తో ఈ జంటలు తిరిగి ఒక్కటయ్యారు. ఇకపై జీవితాంతం కలిసి జీవిస్తామని ప్రమాణం చేశారు.

సంగారెడ్డి క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గం ద్వారా బాధితులకు న్యాయం అందించాలనే లక్ష్యమే ధ్యేయంగా సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలతో జాతీయ లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నారు. కోర్టుల్లో అనేక సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని కేసులు ఇరువర్గాల సమ్మతితో పరిష్కారించుకునే వీలు ఇక్కడ కలుగుతుంది. కోర్టుల చుట్టూ తిరిగి సమయం, డబ్బు వృథా చేసుకోకుండా లోక్‌అదాలత్‌లు మేలు చేస్తున్నాయి. రాజీకి అవకాశమున్న కేసులు, చిన్నచిన్న వివాదాలు, కుటుంబ తగాదాలు, ఎక్సైజ్, బ్యాంకు.. తదితర కేసులు రాజీమార్గంలో పరిష్కరించుకోవడానికి వేదికలవుతున్నాయి.

చట్టబద్ధమైన పరిష్కారం

లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చట్టం 1987 ప్రకారం లోక్‌అదాలత్ ఒక చట్టబద్ధమైన సంస్థ. పెండింగ్‌లో ఉన్న కేసులు, న్యాయస్థానంలో ప్రీలిటిగేషన్ దశలో ఉన్న కేసులను పరిష్కరించే వేదిక. రాజీకి అవకాశమున్న కేసులను మాత్రమే లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చు. ఇక్కడ ఇచ్చేదే అంతిమ తీర్పు. దీనికి వ్యతిరేకంగా ఏ న్యాయస్థానంలోనూ అప్పీల్ చేయడానికి కుదరదు.



కుటుంబ తగాదాలతో విడాకుల కోరిన జంట లోక్‌అదాలత్‌లో ఒక్కటైన దృశ్యం (ఫైల్)

జిల్లావ్యాప్తంగా ఏడు బెంచీలు

సంగారెడ్డి జిల్లాలో ఈ నెల 8న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా సంగారెడ్డిలో మూడు, జహీరాబాద్‌లో రెండు, జోగిపేట, నారాయణఖేడ్‌లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఏడు బెంచీలను ఏర్పాటు చేయనున్నారు. ఆరు వేల కేసులను పరిష్కరించేందుకు న్యాయసేవాధికారసంస్థ చర్యలు తీసుకుంటోంది. ఇందులో ప్రధానంగా క్రిమినల్ కాంపౌండేబుల్, సివిల్, ప్రీలిటిగేషన్, మోటార్ వాహన ప్రమాద పరిహారం కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, సైబర్‌క్రైమ్ కేసులు, భూసేకరణ, విద్యుత్ చౌర్యం నిరోధక కేసులు పరిష్కరించనున్నారు.

ఎక్కువ కేసుల పరిష్కారం

జాతీయ లోక్‌అదాలత్ ఈ నెల 8వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు జిల్లావ్యాప్తంగా ఇప్పటికే పోలీసులు, న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాం. రాజీమార్గమే రాజమార్గమన్న విషయాన్ని కక్షిదారులకు వివరిస్తున్నాం. ఇరువర్గాలకు సమమైన, సత్వర న్యాయం అందుతుందని అవగాహన కల్పిస్తున్నాం. రాజీ కుదుర్చుకోదగిన కేసుల్లో కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి సమయం, డబ్బు వృథా చేసుకోకుండా పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది.

-జి.భవానీచంద్ర, జిల్లా ప్రధాన న్యాయాధికారి

భవిత కేంద్రాల సామగ్రికి నిధులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాల పిల్లలు విద్యనభ్యసించే భవిత కేంద్రాలకు విద్యాశాఖ నిధులు విడుదల చేసింది. జిల్లాలో ఆరు భవిత కేంద్రాలుండగా ఒక్కో కేంద్రానికి రూ.2 లక్షల చొప్పున రూ.12 లక్షల నిధులు కేటాయించింది. భవిత కేంద్రాల్లోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు 115 రకాల సామగ్రి కొనుగోలును సమగ్ర శిక్షా అభియాన్ కింద నిధులు మంజూరు చేశారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధనోపకరణాలు, ఐఈఆర్‌పీలకు కుర్చీలు, చికిత్స అందించే బల్లలు, మసాజ్‌బాల్, డంబుల్స్, రౌండ్ టేబుల్, అల్మారాలు తదితర సామగ్రి కొనుగోలుకు ఈ నిధులు వెచ్చించాల్సి ఉంటుంది.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు

అమీన్‌పూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూమిని కబ్జాచేసి నిర్మించిన గదులను అమీన్‌పూర్ రెవెన్యూ సిబ్బంది మంగళవారం కూల్చివేశారు. పట్టణంలోని సర్వే నంబరు 673లో కొందరు వ్యక్తులు రెండురోజులుగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి గదులను నిర్మించడం ప్రారంభించారు. రాత్రికిరాత్రే గదులను నిర్మించి బయట నుంచి పెయింట్ సైతం వేశారు. గదుల గోడలపై ఇంటి నంబరుగా పేర్కొంటూ కొన్ని నంబర్లను రాయడం గమనార్హం. కాగా రెవెన్యూ సిబ్బంది ఎక్స్‌వేటర్ సహాయంతో నిర్మించిన ఆరు గదులను నేలమట్టం చేశారు. కబ్జాలకు పాల్పడుతున్న వారిని గుర్తిస్తున్నామని ఆర్ఐ రఘువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు... వ్యక్తి మృతి


లాలు(ఫైల్)

చేగుంట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతిచెందాడు. చేగుంట మండల పరిధిలోని సోమ్లాతండాకు చెందిన గుగులోత్ లాలు (42) ఫిబ్రవరి 27న చేగుంట మండలం పొలంపల్లి గ్రామ శివారులో రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య లలిత, ఇద్దరు కుమారులు వరుణ్, నిఖిల్, ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో, బైక్ ఢీ, నలుగురికి తీవ్రగాయాలు

వెల్దుర్తి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఆటో, బైక్ ఢీకొని నలుగురికి తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలోని కుకునూర్ గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామానికి చెందిన విశాల్, రాజు, జగన్ ఒకే బైక్‌పై నర్సాపూర్‌లో జరిగే రిసెప్షన్‌కు బయలుదేరారు. చిన్నశంకరంపేట మండలానికి చెందిన ప్రకాష్ తన ఆటోలో నర్సాపూర్ నుంచి వెల్దుర్తి వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో కుకునూర్ గ్రామ శివారు వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ఉన్న ప్రకాష్‌తో పాటు బైక్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి..


గాయపడిన రమేష్

చేగుంట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. చేగుంట గ్రామానికి చెందిన సోమ రమేష్ చేగుంట నుంచి ద్విచక్ర వాహనంపై తూప్రాన్‌కు వెళ్తున్నాడు. వడియారం బైపాస్ వద్ద గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనం వెనక నుంచి ఢీకొనడంతో రమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. రమేష్‌ను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

వీడిన మహిళ మర్డర్ మిస్టరీ

గుమ్మడిదల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెప్పి మహిళను అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి.. హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. జిన్నారం సీఐ ఎండీ నయీముద్దీన్ కథనం ప్రకారం.. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలానికి చెందిన గుగులోత్ పూర్యా.. కౌడిపల్లి మండలానికి చెందిన ఓ మహిళను గతేడాది డిసెంబర్ 28న గుమ్మడిదల కల్లు కంపౌండ్‌లో కలుసుకున్నాడు. కల్లుతాగే సమయంలో ఆమెకు మాయమాటలు చెప్పి, నల్లవల్లి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. ఇద్దరూ అక్కడ సన్నిహితంగా మెలిగారు. అనంతరం ఆమె గొంతుకు చున్నీ చుట్టి ఊపిరాడకుండా చేసి, చంపేశాడు. మహిళ కనిపించకపోవడంతో ఆమె భర్త గుమ్మడిదల పోలీసులకు ఫిర్యాదు చేశారు. తర్వాత ఆమె మృతదేహం దొరకగా, కేసు మిస్టరీగా మారింది. జిన్నారం సీఐ ఎండీ నయీముద్దీన్ ఆధ్వర్యంలో ఎస్సై ఎం. మహేశ్వర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు పి. వెంకటేశం, సికిందర్, టి. కిషోర్, కె.సాయివర్ధన్‌రెడ్డిలు సీసీ కెమెరాల ద్వారా నిందితుడిని గుర్తించారు. మంగళవారం నిందితుడిని పట్టుకుని, నేరం చేసేందుకు వినియోగించిన వాహనం, సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. నిందితుడిని రిమాండ్‌కు పంపించారు. మిస్టరీ కేసును ఛేదించిన పోలీసులను సీఐ అభినందించారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య


రమేష్ (ఫైల్)

కొండపాక, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతోపాటు భార్య కాపురానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొండపాక మండలం దుద్దెడ పంచాయతీ పరిధిలోని సేలంపు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిలుముల రమేష్ (35) ప్లంబర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. భార్య కాపురానికి రాకపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. కలత చెందిన ఆయన జీవితంపై విరక్తి చెందిన ఆయన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు చూసేసరికి అప్పటికే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్టు ఆయనను వివరించారు.

కుటుంబ తగాదాలతో ఒకరు..


సందీప్ (ఫైల్)

చేర్యాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాలతో మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి.. ఆస్పత్రిలో మంగళవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాడూరుకు చెందిన చెరుకు సందీప్ (32)కు కుటుంబ సభ్యులకు కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్థాపం చెందిన సందీప్ ఇటీవల గ్రామ శివారులో గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు ప్రాథమిక చికిత్స జరిపారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. రెండురోజులుగా ఆస్పత్రిలో ఉన్న సందీప్ మంగళవారం చనిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోమారంలో..

శివ్వంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాలతో, మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన గోమారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని గోమారం గ్రామానికి చెందిన నీరుడి శంకరయ్య (55) సోమవారం కుటుంబ సభ్యులతో ఘర్షణ పడ్డాడు. మద్యం మత్తులో ఉరి వేసుకున్నాడు.

విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్


విద్యుత్ స్తంభం ఎక్కిన విఠల్



రామాయంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రోజూ మద్యం తాగి వచ్చి ఘర్షణ పడుతుండటంతో భార్య తిట్టింది. దీంతో ఓ వ్యక్తి విద్యుత్ స్తంభం ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని రెండు గంటల పాటు హల్‌చల్ చేశాడు. ఈ ఘటన రామాయంపేటలో మంగళవారం జరిగింది. పట్టణానికి చెందిన విఠల్ అనే వ్యక్తి ఇంట్లో గొడవ పడి పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. భార్య తిట్టిందని ఫిర్యాదు తీసుకోవాలని చెప్పడంతో వారు నిరాకరించారు. దీంతో ఆ వెంటనే పోలీస్ స్టేషన్ ఎదుటే ఉన్న పెద్ద విద్యుత్ స్తంభం ఎక్కి, ఆత్మహత్య చేసుకుంటానని కేకలు వేశాడు. దీంతో పోలీసులు వచ్చి, ఫైర్ సిబ్బంది సహాయంతో అతడిని కిందికి దింపేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ వినకపోవడంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది సముదాయించి ఎట్టకేలకు కిందకు దింపటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విఠల్ పై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరాజాగౌడ్ తెలిపారు. విద్యుత్ స్తంభం ఎక్కడంతో ఆ ప్రాంతంలో రెండు గంటల పాటు న్యూసెన్స్ నెలకొంది.

తల్లిని చంపిన కొడుకు జైలుకు..

రామచంద్రాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తల్లిని కిరాతకంగా చంపిన కొడుకును కొల్లూరు పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ రవీందర్ కథనం ప్రకారం... నవారి రాధికారెడ్డి(51)ని ఆమె రెండో కుమారుడు కార్తీక్‌రెడ్డి ఆస్తి కోసం సోమవారం కత్తితో పొడిచి చంపిన విషయం తెలిసిందే. అదే రోజు నిందితుడు కార్తీక్‌రెడ్డిని కస్టడీలోకి తీసుకున్న పోలీసులు, మంగళవారం కోర్టులో హాజరుపరిచి, అక్కడి నుంచి కందిలోని జిల్లా జైలుకు పంపించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



గజ్వేల్ రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మహిళ మృతదేహం మంగళవారం లభ్యం అయ్యింది. గజ్వేల్ ఎస్సై కథనం ప్రకారం.. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గుర్తు తెలియని మహిళ చనిపోయి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెళ్లి చూడగా, సుమారు 45 నుంచి 50 సంవత్సర మధ్య వయస్సు మహిళ చనిపోయి ఉంది. మహిళను ఎవరైనా గుర్తు పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

టీచర్లకు పాఠాలు..!

2024 డీఎస్సీలో నియామకమైన వారికి.. ఈ నెల 12 వరకు తరగతులు

కొండపాక, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మారుతున్న విద్యావిధానంతో నూతనంగా నియామకమైన కొత్త తరం ఉపాధ్యాయులు పోటీపడాలని రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 2024 డీఎస్సీ ద్వారా నియామకమైన ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, భాషా పండితులు తదితర విభాగాలకు చెందిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తోంది. ముందుగా ఎస్జీటీలకు, తర్వాత స్కూల్ అసిస్టెంట్, భాషా పండితులు, స్పెషల్ ఎడ్యుకేషన్, పీఈటీలకు ఈ నెల 12 వరకు శిక్షణ తరగతులు జరగనున్నాయి. ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి సీనియర్ ఉపాధ్యాయులను రిసోర్స్‌పర్సన్‌గా నియమించారు.

అన్ని అంశాల్లో అవగాహన

పాఠశాల నిర్వహణతోపాటు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ శాతం చేరేలా బోధన సాగే ప్రధాన ఉద్దేశంతో శిక్షణ అంశాలు రూపొందించారు. ఆధునిక శాస్త్రసాంకేతికను అందిపుచ్చుకునే విధంగా, విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించేలా శిక్షణ ఇస్తున్నారు. పాఠ్య పుస్తక రూపకల్పన నేపథ్యం. పాఠ్యాంశ నిర్మాణ క్రమం, విద్యాబోధనలో పాఠ్యపుస్తకాన్ని సమర్థవంతంగా ఉపయోగించడం, పాఠ్యప్రణాళికలు రూపొందించడంలో మెలకువలు, నూతన బోధనా పద్ధతులు, మూల్యాంకనంలో మార్పులు, తొలిమెట్టు కార్యక్రమ ప్రాధాన్యత, డిజిటల్ విధానంలో బోధన ఏ విధంగా కొనసాగించాలి, విద్యాశాఖకు సంబంధించిన వివిధ కార్యక్రమాలు ఏ విధంగా నిర్వహించాలి వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలలో నిర్వహించవలసిన కార్యక్రమాలు, వివిధ అంశాలను ఆన్‌లైన్ చేసే పద్ధతులు పాఠ్యాంశాలలో ఉన్నటు వంటి విద్యా ప్రమాణాలు, అభ్యసనా ఫలితాలపైనా అవగాహన కల్పిస్తున్నారు. పై అంశాలకు సంబంధించిన విశ్లేషణాత్మక మాడ్యూల్‌ను ఉపాధ్యాయులకు అందజేయనున్నారు.


శిక్షణ పొందుతున్న నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులు

విద్యా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అందించేందుకు..



సిద్దిపేట జిల్లాలో నూతనంగా నియామకమైన సుమారు 157 మంది ఎస్జీటీలకు శిక్షణ ఇస్తున్నాం. ఉన్నత పాఠశాలలోని నూతన ఉపాధ్యాయులకు ఉమ్మడి జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. నూతన ఉపాధ్యాయుల నియామకం తర్వాత ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ కొరత తీరింది. నూతన ఉపాధ్యాయులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే వివిధ విద్యా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి.

- ఈ.శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట జిల్లా విద్యాధికారి

అంకిత భావంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు



నూతన ఎస్జీటీలు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని, ఇక్కడ నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో పాఠశాలలో సమర్థవంతంగా వినియోగించుకుని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి. నూతన సాంకేతికతను విద్యా బోధనలో ఉపయోగించుకుని సమర్థవంతమైన, నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందజేయాలి. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడం నూతన ఉపాధ్యాయులు బాధ్యత. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు సరైన న్యాయం జరుగుతుంది.

- బేతి భాస్కర్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్

గుణాత్మక విద్య అందివ్వడానికి శిక్షణ



బోధనభ్యాస ప్రక్రియలు, పాఠ్యాంశ నిర్మాణ క్రమం, పాఠ్యాంశ బోధన, పాఠ్యపుస్తకాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం, మూల్యాంకన పద్ధతులు, తొలి మెట్టు వంటి వివిధ అంశాలపై నూతన ఉపాధ్యాయులు సంపూర్ణ అవగాహన పొందుతున్నారు. నూతన సాంకేతికతను విద్యా బోధనలో ఉపయోగించుకుని నాణ్యమైన, గుణాత్మక విద్యను అందించడంలో శిక్షణ ఉపయోగపడుతుంది. కాలానుగుణంగా వచ్చే మార్పులను గమనించి విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడేలా నూతన ఉపాధ్యాయులను తీర్చిదిద్దడం, సమర్థవంతమైన మార్గదర్శిగా ఉపాధ్యాయులను ప్రభావితం చేయడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశం.

-పి.వి. సత్య కుమార్, స్టేట్ రిసోర్స్ పర్సన్



జేఎన్టీయూ విద్యార్థినికి సిల్వర్ మెడల్

పుల్‌కల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ విద్యార్థిని సిల్వర్ మెడల్ దక్కించుకుంది. కళాశాల ఆర్టిఫిషల్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న పడకంటి పవిత్రాచారి చండీగఢ్ వర్సిటీలో నిర్వహించిన ఆల్ ఇండియా యూనివర్సిటీలో జరిగిన ఉమెన్స్ లీగ్‌లో పాల్గొని సిల్వర్ పతకాన్ని కైవసం చేసుకున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని 131 విశ్వవిద్యాలయాలకు చెందిన 1,500 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పవిత్రచారి సిల్వర్ మెడల్ సాధించడంతో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.నరసింహ, క్రీడల విభాగం ఇన్‌చార్జి ప్రొఫెసర్ రజనీష్, జోషి శ్రీపాద అభినందించారు.

ప్రైవేటు అప్పుల నుంచి ఉపశమనం

రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు


మాట్లాడుతున్న రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పాకాల శ్రీహరిరావు

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 04 (ఆంధ్రజ్యోతి): రైతులను ప్రైవేటు అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకర్లకు మార్గదర్శకాలు జారీ చేసిందని రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పాకాల శ్రీహరి రావు అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రైతు రక్షణ సమితి నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. పంట రుణాలకు అదనంగా మొదటి ప్రాధాన్యతతో దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలను మంజూరు చేయాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్ని బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చిందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్ర హైకోర్టు కూడా రిజర్వ్ బ్యాంక్ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని మార్గదర్శకాలు ఇచ్చినందున సిద్దిపేట కోర్టులో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకర్లతో, రైతు సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించామని ఆయన తెలిపారు. దీని ప్రకారం రైతులు దీర్ఘకాలిక వ్యవసాయ రుణాల కోసం వారి సంబంధిత బ్యాంకులలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు రామలింగారెడ్డి, రైతు రక్షణ సమితి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



గొట్టిముక్కుల శివారులో

చిరుత సంచారం

దాడిలో లేగదూడ మృతి

పెద్దశంకరంపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధి గొట్టిముక్కుల శివారులో చిరుత సంచరిస్తుండడంతో గ్రామస్తులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన ఎండీ గౌస్ పొలం వద్ద సోమవారం రాత్రి లేగదూడ వేశాడు. మంగళవారం తెల్లవారుజామున లేగపై చిరుతపులి దాడి చేసి, లేగను చంపేసింది. విషయం తెలిసిన వెంటనే పెద్దశంకరంపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి వికాస్, అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆ ప్రదేశంలో చిరుత పులి పాదముద్రలు గుర్తించినట్లు ఎఫ్ఆర్‌వో వికాస్ తెలిపారు. చిరుత పులిని పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గ్రామస్తులు ప్రజలు రాత్రి సమయంలో పంట పొలాలకు అటవీ ప్రాంతంలో ఎవరు తిరుగవద్దని, జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఆయన వెంట అటవీ శాఖ అధికారులు గ్రామస్థులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

● జడ్పీ సీఈవో ఎల్లయ్య

చేగుంట/మనోహరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. చేగుంట ఎంపీడీవో, మనోహరాబాద్ ఎంపీడీవో కార్యాలయాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, సీనియర్ సహాయకులు శ్రీశైలం పాల్గొన్నారు. అనంతరం చిన్నశంకరంపేట మండల పరిషత్ కార్యాలయంలో కూడా రికార్డులను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం




ప్రమాదంలో దెబ్బతిన్న కారు, వివరాలు సేకరిస్తున్న పోలీసులు




బండ సాయిలు(ఫైల్), బండ మణెమ్మ (ఫైల్)

అల్లాదుర్గం, మార్చి 4. (ఆంధ్రజ్యోతి): తమకున్న కొద్దిపాటి భూమిలో కూరగాయల సాగు చేస్తారు. ఇరుగు, పొరుగు గ్రామాల్లో సంతలు ఎక్కడ జరిగితే అక్కడికి వెళ్లి వాటిని విక్రయించి జీవనం సాగిస్తారా దంపతులు. అయితే, రోడ్డు ప్రమాదం ఇద్దరినీ ఒకేసారి అనంతలోకాలకు తీసుకెళ్లింది. ఎదురుగా వచ్చిన కారు వీరి బైక్‌ను ఢీ కొట్టడంతో దంపతులు దుర్మరణం చెందారు. ఈ ఘటన మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని చిల్వర్ గ్రామ శివారు 161వ జాతీయ రహదారి కుసంబినగర్ (పల్లెగడ్డ) వద్ద మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అల్లాదుర్గంనకు చెందిన బండ సాయిలు (55), మాణెమ్మ (50) దంపతులు మంగళవారం తాము పండించిన కూరగాయాలు అమ్మేందుకు టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గ్రామంలో జరిగే సంతకు బైక్‌పై వెళ్లారు. కూరగాయలు విక్రయించి ఇంటికి తిరిగి వస్తుండగా, కుసంబినగర్ వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వేగంగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో సాయిలు, మణెమ్మలు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో దంపతులను ఢీ కొన్న కారు డివైడర్ సైడ్ వాల్‌ను ఢీ కొని నుజ్జునుజ్జు అయింది. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చురుకొని దర్యాప్తు చేపట్టారు. మృతి చెందిన వీరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆలయంలో బాలుడిని వదిలిపెట్టారు..


ఆలయం వద్ద దొరికిన బాలుడు

ఐడీఏబొల్లారం మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నెలరోజుల బాలుడిని ఆలయంలో వదిలిపెట్టిన సంఘటన ఐడీఏ బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఐడీఏబొల్లారం పట్టణ పరిధి జగన్నాథస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో నెలరోజుల వయస్సున్న ఒక బాలుడు ఏడుస్తూ ఒక టేబుల్‌పై పడుకొని ఉన్నాడు. చుట్టుపక్కల బాలుడి చేరదీశారు. బాలుడి కోసం ఎవరూ రాకపోవడంతో గంట తర్వాత పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి చుట్టుపక్కల విచారణ జరిపారు. ఫలితం లేకపోవడంతో సంగారెడ్డి బాలల సంరక్షణ కేంద్రానికి అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చెరువులో ఇద్దరు గల్లంతు

ఒక మృతదేహం లభ్యం..

న్యాల్‌కల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చెరువులో ఇద్దరు గల్లంతైన ఘటన మండల పరిధిలోని గంగ్వార్‌లో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన సంజేయ్ కామడే (50) ఎస్‌కే ఫయిమ్(17)లు గంగ్వార్ శివారులోని ముల్తానీ బాబా దర్గా సందర్శనకు వచ్చారు. అనంతరం స్నానం చేయడానికి సమీపంలో గల చెరువుకు వెళ్లారు. అక్కడ స్నానం చేసేందుకు చెరువులోకి దిగారు. నీరు అధికంగా ఉండడం.. వారికి ఈత రాకపోవడంతో అందులో మునిగిపోయారు. చెరువుకు సమీపంలో ఉన్న వ్యక్తులు పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. పోలీసులు వచ్చి గాలింపు చర్యలు చేపట్టగా, సంజయ్ కామడే మృతదేహం దొరికింది. ఫయిమ్ మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

ఏడుపాయల గొలుసు దొంగల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

పాపన్నపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల ఆలయ పరిసరాల్లో కొంత కాలంగా మహిళా భక్తుల మెడలోంచి బంగారు ఆభరణాల చోరీలకు పాల్పడుతున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి మంగళవారం పాపన్నపేట ఠాణాలో వివరాలు వెల్లడించారు. కొల్చారం మండలం రంగంపేట గ్రామానికి చెందిన వడ్డే యాదయ్య, సంగారెడ్డి జిల్లా శివ్వంపేటకు చెందిన మక్కని నవీన్, ఉప్పు సాయికుమార్, ఆలకుంట నరేష్, మక్కని పవన్, వడ్డే శ్రీకాంత్, కొల్చారం మండలం చిన్నఘనపూర్‌కు చెందిన వడ్డే నర్సింలు కూలీపనులు, ఆటో డ్రైవర్‌లుగా పని చేస్తున్నారు. వీరు కొన్ని నెలలుగా ఏడుపాయల ఆలయం వద్ద సంచరిస్తూ ఆలయ పరిసరాల్లో ఉన్న సత్రాల్లో రాత్రి బస చేసే మహిళల బంగారు ఆభరణాలు తస్కరిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో సత్రాల్లోకి ప్రవేశించి, నిద్రిస్తున్న మహిళల మెడలోంచి నెయిల్ కట్టర్ సహాయంతో గొలుసును కట్ చేస్తారు. చోరీ చేసిన ఆభరణాలతో ఆటోలో పారిపోతారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 3న రాత్రి ఏడుపాయల వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా ఒక ఆటోలో కొందరు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఇటీవల జరిగిన చోరీలను అంగీకరించడంతో నిందితుల నుంచి సుమారు 12.1 తులాల బరువు గల 5 బంగారు మంగళసూత్రాలను రికవరీ చేశారు. చోరీలకు ఉపయోగించిన ఆటోను, నెయిల్ కట్టర్‌ను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

వీరు మెదక్, సంగారెడ్డి జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో చోరీ కేసులలో సైతం నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. చోరీ కేసులను ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి, ఎస్సై శ్రీనివాస్ గౌడ్, ఏఎస్సైలు గాలయ్య, సంగన్న, కానిస్టేబుళ్లు దుర్గాప్రసాద్, విజయ్, నిర్మల, తదితరులున్నారు.

న్యూస్ బాక్స్

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

చేగుంట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు, వాటిని రక్షించాలని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ రావు అన్నారు. మంగళవారం నార్సింగ్ మండలం భీమ్ రావుపల్లి గ్రామంలో ఇందిరా మహిళా శక్తి పథకం ఆధ్వర్యంలో 110 మంది మహిళలు మొక్కలు నాటారు.

విద్యాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

నారాయణఖేడ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ రెడ్డి సతీమణి అనుపమారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె సొంత ఖర్చుతో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఆక్స్‌ఫర్డ్ ఆంగ్ల డిక్షనరీలు, అట్లాస్ పుస్తకాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అట్లాస్ పుస్తకాలను అందజేశారు.

'బాగా చదివి ఉన్నతంగా ఎదగాలి'

సంగారెడ్డి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ విద్యార్థులకు సూచించారు. సంగారెడ్డి మండలం కల్బగూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్)లో మంగళవారం పదవ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, విరాజ్‌రెడ్డి, వీణకకుమారి, కమల్ జీత్‌కౌర్, శైలజ, సిబ్బంది రాహుల్, ప్రవీణ్, హమీద తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

కోహీర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలో తాగునీటిని ఎద్దడిని నివారించేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త కే.ప్రసాద్ రెడ్డి తన సొంత నిధులతో రెండు తాగునీటి బోర్లను తవ్వించారు. దీంతో గ్రామస్థులు ప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అహిల్య నారీశక్తి అవార్డుకు సానీక్ష ఫౌండేషన్ సభ్యులు

చిన్నశంకరంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : సానీక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవాకార్యక్రమాలు చేపట్టిన సభ్యులు అహిల్య నారీశక్తి అవార్డుకు ఎంపికైనట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ శివ మంగళవారం తెలిపారు. త్వరలో హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో అహిల్య ఉమెన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పూనమ్ నోముల్వార్ చేతులమీదుగా అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు.

సైన్స్ ఎగ్జిబిషన్ పరిశీలన

చిలప్‌చెడ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని కాంప్లెక్స్ హెచ్ఎం రమేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలం పరిధిలోని బండపోతుగల్ ప్రాథమిక పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లను పరిశీలించి, అభినందించారు.

ఘనంగా కల్యాణ ఉత్సవం

రామచంద్రాపురం టౌన్ మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ పురపాలక పరిధి పాటి గ్రామంలో భ్రమరాంబికా మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం సమయంలో స్వామివారి కల్యాణ కార్యక్రమం నిర్వహించారు. పోచారం గ్రామంరేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం జరిపారు. ఉదయం నుంచి జరిగిన పూజల్లో ఎమ్మెల్యే, గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గోబర్ గ్యాస్ గుంతలో చనిపోయిన కోళ్ల పారబోత

శివ్వంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల, దేవమ్మగూడెం సరిహద్దు దేవమ్మగూడెం శివారులో పంట పొలాల దగ్గర గోబర్ గ్యాస్ గుంతలో గుర్తుతెలియని వ్యక్తులు చనిపోయిన కోళ్లను పడేశారు. వందల సంఖ్యలో చనిపోయిన కోళ్లను సంచుల్లో తీసుకొచ్చి వేయడంతో చిన్నగొట్టిముక్కల శివారులో ఉపాధిహామీ పనులు చేపడుతున్న కూలీలు దుర్గంధంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కూలీలు కోరారు.

అసంపూర్తిగానే కళాశాల భవనం పనులు

- ప్రారంభించి మూడేళ్లు కావస్తున్నా ఎక్కడి పనులు అక్కడే
- పనుల్లో కనిపించని నాణ్యతా ప్రమాణాలు


కళాశాలలో వృథాగా పడిఉన్న నీటి శుద్ధి పరికరాలు

అల్లాదుర్గం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలన్న ప్రభుత్వ ఆశయానికి కొందరు అధికారులు తూట్లు పొడుస్తున్నారు. దీంతో కళాశాలలోని పనులు అసంపూర్తిగా వెక్కిరిస్తున్నాయి. అల్లాదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పక్కా భవనం నిర్మించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం నాబార్డు ద్వారా రూ.2.50 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో నిర్మించిన భవనాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు 22 జూన్ 2022న ప్రారంభించారు. ఇక్కడివరకు బాగానే ఉన్నా.. ఈ భవనం పై అంతస్తులోని గదిలో ఫ్లోరింగ్ చేయలేదు, నీటి శుద్ధి యంత్ర పరికరాలను బిగించకుండా వదిలేశారు. రెండేళ్లవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ విషయమై సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నాయి. భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు వెక్కిరిస్తున్నాయి. పనులు పూర్తయి ఆరునెలలు గడవకముందే తరగతి గదిలోని పైఅంతస్తు కప్పు పెచ్చులూడిపోతున్నాయి. సైడ్ పిల్లర్, గోడకు బీటలు వారి పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ విషయమై గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా.. అధికారులు పట్టించుకోకుండా ప్రారంభించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ముందస్తు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు సూచిస్తున్నారు. ఈ విషయమై ఏఈ మల్లప్పను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. అసంపూర్తి పనులు కోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరుకాగానే పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పటిష్టతకు కలిసి కట్టుగా కృషి

- ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ సమీక్షలో నీలం మధుముదిరాజ్


ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మధుముదిరాజ్

పటాన్‌చెరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్‌ను తిరుగులేని శక్తిగా మలిచేందుకు కలిసికట్టుగా కృషి చేస్తామని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ అన్నారు. మంగళవారం నగరంలోని గాంధీభవన్‌లో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ఏఐసీసీ సెక్రెటరీ విష్ణునాథ్, మంత్రులు దామోదర్‌రాజనర్సింహ, కొండాసురేఖ, జగ్గారెడ్డి తదితరుల నేతృత్వంలో నిర్వహించిన మెదక్ లోక్‌సభ పార్టీ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ కోసం అనుక్షణం కృషి చేసే కార్యకర్తలను కాపాడుకునేందుకు ప్రతి నాయకుడు కృషి చేయాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అందేలా కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా కృషి చేస్తామన్నారు.

హార్టికల్చర్ సాగుపై రైతులు దృష్టిసారించాలి

- ప్లాంటేషన్ జిల్లా మేనేజర్ శ్రావణ్‌కుమార్


మామిడి తోటను పరిశీలిస్తున్న శ్రావణ్‌కుమార్, ఈజీఎస్ అధికారులు

అల్లాదుర్గం,మార్చి 4. (ఆంధ్రజ్యోతి) : హార్టికల్చర్ సాగుపై రైతులు దృష్టిసారించాలని ప్లాంటేషన్ జిల్లా మేనేజర్ శ్రావణ్‌కుమార్ కోరారు. మంగళవారం అల్లాదుర్గం మండలంలోని కాయిదంపల్లి, అల్లాదుర్గం తదితర గ్రామాల్లో సాగుచేస్తున్న పండ్ల తోటలను, కూరగాయల సాగును పరిశీలించి మాట్లాడారు. పండ్లు, కూరగాయల సాగుకు ఉపాధి హామీ నిధుల ద్వారా రైతులకు ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు ఈజీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో చంద్రశేఖర్, ఈజీఎస్ ఏపీవో సుధాకర్, టీఏ సాయికుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్, నవీన్ ఉన్నారు.

ప్రభుత్వం స్పందించే వరకు దీక్ష ఆపం


దీక్షలో అశోక్‌గౌడ్ తదితరులు

నర్సాపూర్/గుమ్మడిదల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నల్లవల్లి సమీపంలో ఏర్పాటు చేయనున్న డంపింగ్‌యార్డు వల్ల నర్సాపూర్ ప్రాంతం సర్వ నాశనం అవుతుందని, ఎట్టి పరిస్థితుల్లో డంపింగ్‌యార్డును కానివ్వమని మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ స్పష్టం చేశారు. మంగళవారం డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన దీక్షలో ఆయనతో పాటు 1వ వార్డుకు చెందిన పలువురు పాల్గొని నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించే వరకూ ఆందోళన ఆపమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, బీఆర్ఎస్ నాయకుడు రాకేష్‌గౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ ప్యారానగర్‌లో ఏర్పాటు చేయనున్న డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన దీక్ష 28వ రోజుకు చేరింది. మంగళవారం జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో సృజన టెక్ ఫెస్ట్

సంగారెడ్డి రూరల్/జహీరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం సృజన టెక్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రియదర్శిని మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకమైన కళలను వెలికితీసేందుకే సృజన టెక్ ఫెస్ట్ నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ సబ్ రీజనల్ ఇంజనీర్ రమేష్ అజ్‌మిరి, రత్నపురి కళాశాల హెచ్‌వోడి క్రాంతికుమార్, సంగారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ గౌడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ప్రొఫెసర్ నర్సింహకుమార్, ప్రిన్సిపల్ సువర్ణలత, మహీంద్రా కర్మాగారం మేనేజర్ మధుకిరణ్ పేర్కొన్నారు. పట్టణంలోని రంజోల్ పాలిటెక్నిక్ కళాశాలలో సృజన టెక్ ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని జహీరాబాద్-మెకానిక్, జోగిపేట-ఈసీఈ, మెదక్-సివిల్, సిద్దిపేట-సీఎస్ఈ, సంగారెడ్డి-ఈసీఈ కళాశాలలకు చెందిన 40 మంది విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాతృభాష తల్లివంటిది

- ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మాతృభాష తల్లిలాంటిదని ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ ఆచార్యులు డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఖేడ్ మండలం చాప్టా.కె ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల హెచ్ఎం నర్సింహులు అధ్యక్షతన అష్టావధానం, పద్యకవి, పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు భూమయ్య రచించిన శ్రీరామ శతకం పుస్తకాన్ని బాషాభిమాని కంది శంకరయ్య, రసగీతి సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు మహిపాల్‌రెడ్డి, అవధాని భానుప్రకాష్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో సాహిత్య సమావేశం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు విద్యుత్ అధికారి రాఘవులు, పృచ్ఛకులుగా వడ్ల రాజయ్య, ఈశ్వరయ్య, మారుతి, పద్మాకర్, మారుతి, నర్వ పండరి, రేణుక, శోభ, ఉపాధ్యాయులు, సాహితీ, అభిమానులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నియోజవర్గ అధ్యక్షురాలిగా ఆస్మా తబస్సుం


ఆస్మా తబస్సుం

జహీరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ జహీరాబాద్ నియోజవర్గ మహిళా అధ్యక్షురాలిగా జహీరాబాద్‌కు చెందిన ఆస్మా తబస్సుంను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కాట సుధాశ్రీనివాస్‌గౌడ్ మంగళవారం హైదరాబాద్‌లో నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆస్మాతబస్సుం మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్‌కు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డికి, మాజీ మంత్రి డా.చంద్రశేఖర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలను జాగృతం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

నెలరోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలి

- మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శశిధర్‌రెడ్డి

పాపన్నపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు దరఖాస్తు చేసుకున్న నెలరోజుల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని విద్యుత్ నియంత్రణ మండలి సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మండలి చైర్మన్ దృష్టికి పలు విషయాలు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దరఖాస్తు పెట్టుకున్న నెలరోజుల్లోనే ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి ఇవ్వాలన్నారు. ప్రమాదవశాత్తున విద్యుత్ తీగలు తగిలి లేదా ఇంకేదైనా ప్రమాదం ఏర్పడి రైతు కానీ, ఇంకెవరైనా మరణిస్తే ప్రస్తుతం ఇస్తున్న రూ.5 లక్షలను రూ.15 లక్షలకు పెంచాలన్నారు. తక్షణమే ఇక్కడ విద్యుత్ స్టోర్ ఆఫీస్‌ను నెలకొల్పాల్సిందిగా కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

చాకరిమెట్ల హుండీ ఆదాయం లెక్కింపు

శివ్వంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయం హుండీ లెక్కింపు మంగళవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు ఆధ్వర్యంలో లెక్కించారు. ఐదు నెలల హుండీ ఆదాయం రూ.5 లక్షల 75 వేల 8 వందల 876 వచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ రంగారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ, ఈవో సార శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా కొమురయ్య గెలుపుపై సంబురాలు


నర్సాపూర్‌లో సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

పెద్దశంకరంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ ఉపాధ్యాయ బీజేపీ ఎమ్మెల్సీగా (తపస్) మల్క కొమురయ్య మొదటి ప్రాధాన్యతా ఓటుతో గెలవడం పట్ల బీజేపీ పెద్దశంకరంపేట మండలాధ్యక్షుడు కోణం విఠల్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం బీజేపీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

●జిన్నారం: జిన్నారంలో బీజేపీ మండలాధ్యక్షుడు జగన్‌రెడ్డి, టీపీయూఎస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వేర్వేరుగా సంబరాలు నిర్వహించారు.

●నర్సాపూర్: నర్సాపూర్‌లో ప్రధాన చౌరస్తా వద్ద ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోదరాజేందర్, సీనియర్ నాయకులు కాల్చి స్వీట్లు తినిపించారు.

●వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తిలోని బస్టాండ్ చౌరస్తా వద్ద బీజేపీ మండలాధ్యక్షుడు దాసు ఆధ్వర్యంలో నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

మార్కండేయ ఆలయ ప్రతిష్ఠాపన


మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా జలాధివాసంలో విగ్రహాలు

నారాయణఖేడ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణ శివారులోని వెంకటాపూర్ క్రాస్‌రోడ్స్ వద్ద నిర్మించిన మార్కండేయ ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పుణ్యాహవచనం, గణపతిపూజతో పాటు మహాహోమం, సామూహిక లింగాభిషేకాల కార్యక్రమం బ్రహ్మశ్రీ గురురాజ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాగా విగ్రహాలకు జలాధివాసంతో పాటు క్షీరాభిషేకం, కుంకుమార్చన, సహస్రనామార్చన కార్యక్రమాలు నిర్వహించగా మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం టీటీడీ ఆధ్వర్యంలో భక్తమార్కండేయ హరికథ కాలక్షేప కార్యక్రమాన్ని కొన్యాల రాంరెడ్డి నిర్వహించారు.

వైభవంగా రాచన్నస్వామి జాతర

కోహీర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల రాచన్న స్వామి జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలను కౌలాస్ జహీరాబాద్ వారిచే నిర్వహించారు. అనంతరం గంగపూజ, గోపూజ, స్వస్తి పుణ్యావాచనం, అంకురారార్పణ, నాంది సమారాధన అఖండ దీపా ప్రజ్వలన కార్యక్రమాలతో పాటు శివయోగి శివా చార్య మహాస్వామి తంగడపల్లిగారిచే ధ్వజారోహణం, శిఖరపూజ నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, కాంగ్రెస్ జహీరాబాద్ అసెంబ్లీ నాయకుడు కే.ప్రసాద్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్రతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో శివరుద్రప్ప, ఆలయ రినివేషన్ కమిటీ అధ్యక్షుడు దయానంద్ పాటిల్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలి


గడ్డపోతారంలో విద్యుత్ సమస్యలపై రైతులతో మాట్లాడుతున్న డీఈ, ఇతర అధికారులు

జిన్నారం/చిలప్‌చెడ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి పటాన్‌చెరు విద్యుత్ డీఈ భాస్కర్‌రావు సూచించారు. మంగళవారం విద్యుత్ సమస్యలు తెలుసుకునేందుకు లక్ష్మీపతిగూడెం, వావిలాల, నల్తూరు, కాజీపల్లి, గడ్డపోతారం గ్రామాల్లో పర్యటించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని రైతులను కలుసుకుని విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, తదితర సమస్యలపై ఆరాతీశారు. వేసవిలో ఎలాంటి సమస్యలు లేకుండా సరఫరా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ దుర్గాప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లు, రైతులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు. వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ రూరల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిట్కుల్ సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏ కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు.

ప్రజాపాలన అంటే అక్రమ అరెస్టులేనా..?


సీఐటీయూ నాయకులను అరెస్టు చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

సంగారెడ్డి రూరల్/నిజాంపేట/నాగల్‌గిద్ద, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన అంటే అక్రమ అరెస్టులేనా అని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి ప్రశ్నించారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌కు వెళ్తున్న సీఐటీయూ నాయకులను పోలీసులు అరెస్టు చేసి సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిజాంపేట మండల పరిధిలోని ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను పోలీసులు వారి ఇళ్ల వద్దకు వెళ్లి అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో అంగన్‌వాడీలు రమావ సునీత, సుధా, వీణ, మంజుల, రేణుక, అరుణ శ్రీ, దుర్గేశ్వరి, మణెమ్మ, రామలక్ష్మి ఉన్నారు. నాగల్‌గిద్ద మండల పరిధిలోని ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు అరెస్ట్ చేసి, సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

రెండు లక్షల రుణమాఫీ ఇంకెప్పుడు..!

సంగారెడ్డి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఇంకెప్పుడు చేస్తారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాజ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సంగారెడ్డిలో లీడ్ బ్యాంకు మేనేజర్ గోపాల్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం కొందరికి మాత్రమే చేసి చేతులు దులుపుకున్నదని విమర్శించారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు మల్లారెడ్డి, జైపాల్ రెడ్డి, బసప్ప, సాయిలు దతితరులు ఉన్నారు.

రూ.2 లక్షలు రుణమాఫీ చేపట్టాలి

పుల్‌కల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షలు రుణమాఫీ వెంటనే చేపట్టాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. మంగళవారం లీడ్ బ్యాంక్ మేనేజర్ గోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పుర మల్లారెడ్డి, పట్లోళ్ల జైపాల్‌రెడ్డి, బసప్ప, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతన అమలుకు రాష్ట్రవ్యాప్త ఉద్యమం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

సంగారెడ్డి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు కనీస వేతనాల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం నిర్వహించనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ తెలిపారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కష్టపడి పనిచేస్తున్న కార్మికులకు నేటికి కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 7వ తేదీవరకు రాష్ట్రవ్యాప్తంగా క్యాంపెయిన్ నడుస్తుందని, ప్రతీ కార్మికుడిని కలిసి చైతన్యపరుస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, జీ.సాయిలు, నాయకులు పాల్గొన్నారు.

దశాబ్దాల కాలం నాటి భూములకు మోక్షం

రామచంద్రాపురం టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ పురపాలక పరిధి కొల్లూరు గ్రామం సర్వేనంబరు 347లోని 14.5 ఎకరాల భూమిని నిషేధిపు జాబితాలో పెట్టారు. అవుటర్ రింగు రోడ్డు నిర్మాణం జరుగుతున్న సమయంలో నాటి సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అవుటర్ అలైన్‌మెంటు మార్చారు. ఇందుకు అనుగుణంగా భూసేకరణ జరిపారు. అనంతరం చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చారు. శాస్త్రీయ పద్ధతిలో అవుటర్ నిర్మాణం జరగాలంటే అలైన్‌మెంటు మార్చారు. ఫలితంగా వైఎస్ సమయంలో తీసుకున్న భూములను నిషేధపు జాబితాలో ఉంచారు. సంవత్సరాలుగా వస్తున్న దరఖాస్తులను అదనపు కలెక్టర్ మాధురి పరిశీలించారు. నిషేధపు జాబితా నుంచి తొలగించేటట్టు చర్యలు తీసుకుంటున్నామని ఆమె చెప్పారు. మంగళవారం కొల్లూరు గ్రామంలో సర్వేయర్ల బృందంతో కలిసి పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నిషేదపు జాబితాకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు.

ప్రైవేట్ ఉపాధ్యాయులకు జీతం ఇవ్వని యాజమాన్యం

శివ్వంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మూడునెలలుగా ఉపాధ్యాయులకు వేతనాలు ఇవ్వకపోవడంతో ప్రైవేట్ పాఠశాల టీచర్స్ విధులను బహిష్కరించారు. మండల పరిధిలోని ఉన్నత గ్లోబల్ ప్రైవేట్ పాఠశాలలో 15 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అయితే మూడునెలలుగా యాజమాన్యం విధులు చెల్లించకపోవడంతో ప్రిన్సిపాల్‌ను పలుమార్లు వేతనాలు ఇవ్వాలని కోరినా స్పందన రాకపోవడంతో విధులు బహిష్కరించి పాఠశాలకు రాలేదని చెప్పారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండంతో పాఠ్యాంశాలు బోధించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కాగా బస్సు డ్రైవర్, పాఠశాల సిబ్బందికి కూడా వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సిబ్బంది తెలిపారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపల్ శైలజను సంప్రదించగా వేతనాలు ఇవ్వలేని విషయం నిజమేనని పలుసార్లు యాజమాన్యానికి తెలిపినా పట్టించుకోకపోవడంతో సమస్య వచ్చిందన్నారు.

ఘనంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

రామచంద్రాపురం టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : భారతీనగర్ డివిజన్ పరిధి బాంబేకాలనీలో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. వేదపండితుల పర్యవేక్షణలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం

హవేళిఘణపూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని బొగుడభూపతిపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మరాఠీ నర్సమ్మ పూరిల్లు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంట్లోని నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, బట్టలు, బీరువా, రూ.50 వేల నగదు, బంగారు ఆభరణాలు, ధ్రువపత్రాలు కాలి బూడిదయ్యాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.